క్లుప్తంగా

జిల్లా యూత్ కాంగ్రెస్ ఎన్నికలు ప్రారంభం

ఖలీల్‌వాడి: జిల్లా యూత్ కాంగ్రెస్ ఎన్నికలు బుధవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎంపిక కోసం ఆన్‌లైన్‌లో యూత్ కాంగ్రెస్ యాప్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 18 నుంచి 35 సంవత్సరాలు కలిగిన యువకులు యూత్ కాంగ్రెస్ ఎన్నికల యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఓటు వేయడానికి అవకాశం కల్పించారు. అధ్యక్ష పోటీలోనిజామాబాద్ అర్బన్ నుంచి విపుల్‌గౌడ్, ఆద్నాన్, రూరల్ నుంచి నరేష్, సాయికిరణ్, ఆర్మూర్ నుంచి శ్రీకాంత్, బాల్కొండ నుంచి నాగేందర్ పోటీలో ఉన్నారు. అలాగే ప్రధాన కార్యదర్శి కోసం 19మంది పోటీ పడుతున్నారు. జనరల్ ఎన్నికల మాదిరిగానే యూత్ కాంగ్రెస్ ఎన్నికలు జరగడం చర్చనీయాంశంగా మారింది. అధ్యక్ష ప దవీ ఏకగ్రీవం కోసం జిల్లా ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎన్నికలు అనివార్యం అయ్యాయి. ఈ ఎన్నికలు సెప్టెంబర్ 14 వరకు కొనసాగుతాయని నేతలు పేర్కొన్నారు.

ఢిల్లీ పరేడ్‌కు బినోల విద్యార్థిని

నవీపేట: మండలంలోని బినోలకు చెందిన విద్యా ర్థిని కె భవానిక ఢిల్లీలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు ఎంపికైనట్లు హెచ్ఎం మోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఇటీవల గుజరాత్‌లో నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో పాల్గొని పీఎం నరేంద్రమోదీ చదివిన పాఠశాలలో పది రోజుల పాటు ప్రత్యే క శిక్షణ తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వ్యాయామశాల ప్రారంభం

బోధన్‌రూరల్: పట్టణంలోని మారుతి మందిర్ వద్ద విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హనుమాన్ వ్యాయామశాలను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నాయకులు సురేష్ ఇనాని, హరికృష్ణ రెడ్డి, న్యాయవాది కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత

బోధన్: పట్టణ కేంద్రం నుంచి నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, సాలూర గ్రామాల మీదుగా మహారాష్ట్ర వెళ్లే అంతర్రాష్ట్ర రోడ్డుకు, నాగన్‌పల్లి వద్ద రోడ్డుకు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు గుంతను పూడ్చివేశారని కాంగ్రెస్ పార్టీ సాలూర మండల అధ్యక్షుడు మందర్న రవి పేర్కొన్నారు. నాయకులు అల్లె రమేష్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకోటకు రైతు ప్రతినిధులు

బోధన్: దేశ రాజధాని ఎర్రకోట వద్ద నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కేంద్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు బోధన్‌కు చెందిన కిసాన్ ఎఫ్‌పీసీఎల్(ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్) ఏడుగురు డైరెక్టర్ల దంపతుల బృందం వెళ్లింది. వీరిని నాబార్డు సంస్థ ఎంపిక చేసి ఢిల్లీ వెళ్లేందుకు రవాణ, ఇతర సదుపాయాలను కల్పించింది. వీరు బుధవారం ఉదయం ఢిల్లీ చేరుకున్నారు.

మున్సిపల్ ఏఈకి సన్మానం

బోధన్ టౌన్: బోధన్ మున్సిపల్ ఏఈ శివకృష్ణను మున్సిపల్ కాంట్రాక్టర్లు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, కాంట్రాక్టర్లు జేమ్స్, జాకబ్, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ఎడపల్లి: ఖాతాదారులకు కెనరా బ్యాంక్ మెరుగైన సేవలు అందిస్తోందని ఆర్వో ఏజీఎం జి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మంగళ్‌పాడ్‌లో ఏర్పాటు చేసిన కెనరాబ్యాంక్ నూతన బ్రాంచ్‌ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ శ్రావణ్, ఐకేపీ ఏపీఎం సాయిలు, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ రజిత, సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం

బోధన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ అలుపెరుగని పోరాటాలు చేస్తోందని జిల్లా అధ్యక్షుడు సిద్ధా నాగరాజు, ప్రధాన కార్యదర్శి పెద్ది సూరి అన్నారు. పట్టణ కేంద్రంలో సంఘం డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా రాజు, ప్రశాంత్‌లను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. జిల్లా ప్రతినిధులు గణేశ్, మహేశ్, సభ్యులు నవీన్, కార్తీక్, ప్రసాద్, సంతోష్, సాయి, ఆజాద్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య శిబిరం

ఎడపల్లి: మండల కేంద్రంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో తెలంగాణ ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఆయూష్ వైద్యాధికారి వెంకట్, ఏఎన్ఎంలు మాధవిలత, ఆశాకార్యకర్తలు రాజమణి, అనసూయ, పద్మ పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న మోహన్

మాక్లూర్: మండలంలోని కల్లెడికి చెందిన పురం మోహన్ సోషల్ జస్టిస్ ఫర్ వర్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చైర్మన్ కొప్పుల విజయ్ కుమార్ చేతుల మీదుగా హైదరాబాద్‌లో బెస్ట్ సోషల్ యాక్టివిటీ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు వన్నెల సాయన్న, చంద్రకుమార్ పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

బంగ్లాదేశ్‌పై సైనిక చర్య తీసుకోవాలి

- హిందూ సంఘాల డిమాండ్
- పలు చోట్ల కొవ్వొత్తులతో నిరసన


నవీపేటలో బీజేపీ నాయకులు


ఆర్మూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, నాయకులు

నవీపేట/ నందిపేట్/ ఆర్మూర్‌టౌన్: హిందువులపై మారణకాండకు పాల్పడుతున్న బంగ్లాదేశ్‌పై కేంద్ర ప్రభుత్వం సైనిక చర్య జరిపి భారత్‌లో విలీనం చేయాలని హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి. బంగ్లాదేశ్‌లోని హిందువులపై ఇస్లామిక్ కుట్రదారులు జరుపుతున్న దాడికి నిరసనగా ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని మండలాల్లో హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నవీపేటలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు, నందిపేట్‌లో యువకులు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. ఆర్మూర్‌లో పట్టణంలో ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి హిందూ పరిరక్షణ సమితి సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం



వర్ని: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడులకు నిరసనగా వర్ని, చందూరు మండల కేంద్రాల్లో హిందూ సంఘాలు ఇచ్చిన బంద్ బుధవారం విజయవంతమైంది. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి క్రీడాకారుల ఎంపిక

- జిల్లా జట్టులో జాతీయస్థాయి క్రీడాకారిణి సౌమ్య

నిజామాబాద్‌నాగారం: నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 16నుంచి రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నారు. ఈసందర్భంగా పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మీర్ ఫరూక్ అలీ, మొహమ్మద్ జావేద్ తెలిపారు. జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆ ధ్వర్యంలో డాక్టర్ కవిత టోర్నీ చైర్‌పర్సన్ సౌజన్యంతో పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా జట్టులో భారత జట్టు క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య పాల్గొనడం కొస మెరుపు. జిల్లా జట్టుకు చీఫ్ కోచ్‌గా భక్త పాల్, మేనేజర్‌గా మొహమ్మద్ అజ్మత్‌ఖాన్, అసిస్టెంట్ కోచ్‌గా గొట్టపాటి నాగరాజు వ్యవహరించనున్నారు. ఎస్ రోనిష, సీ అశ్విని, నక్షత్ర, రష్మిక, మధుశ్రీ, విజయలక్ష్మి, గుగులోత్ సౌమ్య, సహస్ర, మోక్ష తపస్వి, సాయిసమీక్ష, ప్రజ్ఞ, సింధూర, శ్రీష్మ, శుశాంతిక, హరిని యా దవ్, జహాన్వి యాదవ్, లహరి, గీతిక చౌదరి, నిషి త, మాధవి, సంజన, ఏ రిశ్విక, అలిన జరీన్, మనస్విని, నిర్వి, సయీద సలేహ ఫాతిమా ఎంపికయ్యారు.

జిల్లాస్థాయికి ఎంపికైన అంక్సాపూర్ విద్యార్థుల ప్రాజెక్టు



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీకాంత్, అభినవ్ ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో తయారు చేసిన ప్యాడీ డ్రైవింగ్ మెసేజ్ పరికరం జిల్లాస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం మల్లీశ్వరి బుధవారం తెలిపారు. గైడ్ టీచర్ రఘునాథ్ ఆధ్వర్యంలో ఈ పరికరం తయా రు చేశారన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే ప్రదర్శన కార్యక్రమంలో దీనిని ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను, గైడ్ టీచర్‌ను ఉపాధ్యాయులు, వీడీసీ సభ్యులు అభినందించారు.

క్రైం కార్నర్

చోరీ కేసులో నిందితుల అరెస్ట్



బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్‌లో గత నెల 19న పుంచెట్టి లింగన్న అనే వ్యక్తి ఇంటి తాళాన్ని పట్టపగలు పగులగొట్టి 8తులాల బంగారం, నగదును ఎత్తుకెళ్లిన నిందితులను బాల్కొండ పోలీసులు బుధవారం ఆర్మూర్ పట్టణంలో అరెస్ట్ చేశారు. ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందెడ్ జిల్లా ఉమ్రి మండలం కార్ల గ్రామానికి చెందిన ముస్కర్ నాందేవ్ అలియాస్ జ్ఞానేశ్వర్, ఉమ్రికి చెందిన సబ్నెద్వాడ్ మహదేవ్ అలియాస్ శివ చోరీ కేసులో పట్టుబడ్డారన్నారు. నాందేవ్ గతంలో కూడా పట్టపగలు మోర్తాడ్, వేల్పూర్, భీమ్‌గల్, బాల్కొండ, ఆర్మూర్, బాన్సువాడల్లో చోరీలకు పాల్పడ్డాడని తెలిపారు. చిట్టాపూర్‌లో చోరీ చేసిన బంగారాన్ని ఆర్మూర్‌లో విక్రయిస్తున్నారనే సమాచారం అందడంతో అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుల నుంచి ఆరు తులాల బంగారం రికవరీ చేశామని, మరో రెండు తులాల బంగారం ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టినట్లు తెలిసిందన్నారు. ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించామని తెలిపారు. కేసును ఛేదించిన బాల్కొండ ఎస్సై యాసర్ అరాఫత్, సిబ్బందిని అభినందించారు.

ఉద్యోగం రావడం లేదని ఆత్మహత్య

మోర్తాడ్: ఉద్యోగం రావడం లేదనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. మోర్తాడ్‌కు చెందిన భోగ సాయి(28) ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం లండన్‌కు వెళ్లి వచ్చాడు. తాను కోరుకున్న ఉద్యోగం దక్కడం లేదని తీవ్రమనస్తాపానికి గురైన సాయి మంగళవారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాండ్లపేట్ శివారులోని వాగులో సాయి మృతదేహం బుధవారం లభించింది. మృతుడి తండ్రి భోగ రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక టిప్పర్లు సీజ్

బోధన్‌రూరల్: మండలంలోని పెగడపల్లి మార్గంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను రెవెన్యూ అధికారులు బుధవారం రాత్రి సీజ్ చేశారు. తనిఖీల్లో తహసీల్దార్ విఠల్, ఆర్ఐ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్‌లో సైబర్ మోసం

బోధన్‌రూరల్: సైబర్ నేరగాళ్ల మోసానికి మండలంలోని ఓ మహిళ రూ. 99 వేల పోగొట్టుకున్నారు. బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొప్పర్తి క్యాంప్ గ్రామానికి చెందిన బొల్లెపల్లి విజయలక్ష్మికి హైదరాబాద్‌లోని నిజాంపేట్‌లో ఫర్నిచర్ ఇల్లు ఉంది. దానిని అద్దెకు ఇచ్చేందుకు హౌస్ కార్నర్ అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసింది. దీనిని గమనించిన సైబర్ నేరగాళ్లు తాము ఢిల్లీలో ఉన్న ఆర్మీ కార్యాలయంలో పనిచేస్తామని తమకు అద్దెకు ఇవ్వాలని కోరారు. రెండు నెలల అద్దెను ముందుగా చెల్లిస్తామని నమ్మబలికారు. తాము తమ కార్యాలయం నుంచి అద్దె చెల్లించాలంటే మీ అకౌంట్‌లో డబ్బులు ఉండాలంటూ నమ్మించారు. వీరి మాటలు నమ్మిన ఆమె విడతల వారీగా రూ. 99 వేలు జమ చేసింది. దీంతో వారు ఆన్‌లైన్ మోసానికి పాల్పడి నగదును దొంగిలించారు. మోసపోయినట్లు గుర్తించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య..

బాల్కొండ: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ముప్కాల్ మండలం కొత్తపల్లిలో చోటు చేసుకుంది. ముప్కాల్ ఏఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లికి చెందిన బద్దం రాజేశ్వర్(52) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. చివరికి గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొరియర్ సెంటర్‌లో చోరీ

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని ఈకామ్ ఎక్స్‌ప్రెస్ కొరియర్ కార్యాలయంలో మంగళవారం తెల్లవారు జామున ఇద్దరు దుండగులు చోరీకి పాల్పడ్డారు. తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించిన ఇద్దరు దుండగులు సుమారు రూ.65వేల విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. కొరియర్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యభర్తలపై కేసు నమోదు

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ గ్రామంలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి పాల్పడిన దంపతులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ బుధవారం తెలిపారు. ఫకీరాబాద్‌కు చెందిన స్పందన అనే విద్యార్థిని నాగేపూర్‌లో ఆర్టీసీ బస్సులో ఎక్కిందని పేర్కొన్నారు. తోపులాటలో భాగంగా డ్రైవర్ రెడ్యా దూషించాడని స్పందన తన తల్లితండ్రులకు చెప్పింది. దీంతో వారు తిరుగు ప్రయాణంలో డ్రైవర్‌పై దాడి చేశారు. దీంతో శ్రీనివాస్ దంపతులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువతి ఆత్మహత్య

రెంజల్: మండలంలోని కందకుర్తి గోదావరి నదిలో ఓ యువతి దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం గుర్తు తెలియని ఓ యువతి స్కూటీపై వచ్చి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుందన్నారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక జాలార్లతో పోలీసులు మృతదేహన్ని వెలికి తీయించారు. మృతురాలి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై సాయన్న పేర్కొన్నారు. ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని అన్నారు.

మొక్కలను పెంచాలి



రెంజల్: ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్ అన్నారు. రెంజల్‌లోని రైతు వేదిక ఆవరణలో బుధవారం రైతులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పంటల నమోదు సర్వేను పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, డీలర్లు, వ్యవసాయ విస్తీర్ణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్‌లో ఏకాభిప్రాయం

రుద్రూర్: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఇద్దరు నామినేషన్లు దాఖలు చేయగా రాయకూర్‌కు చెందిన నితిన్ పటేల్‌ను ఏకాభిప్రాయంతో ఆమోదించినట్లు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ కార్తీక్ బుధవారం వెల్లడించారు. సమావేశంలో విండో డైరెక్టర్ కర్క అశోక్, నాయకులు నిస్సార్, రాజా వరప్రసాద్, అడ్ప సాయిలు, పట్ల సురేష్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి పెరిగిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగు వ ప్రాంతాల నుంచి వరద నీరు పెరిగింది. బుధవారం ప్రాజెక్ట్‌లోకి 7500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 50 క్యూసెక్కులు ఆయకట్టుకు వదులుతున్నా రు. ఆవిరి రూపంలో 502 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1081.00 (47.82 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

కరెంట్ తీగలకు తగిలి డ్రోన్ ధ్వంసం



రెంజల్: ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యం ఓ రైతుకు నష్టాన్ని కలిగించింది. వరిలో డ్రోన్‌తో పిచికారీ చేయిస్తుండగా కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలకు తగిలి డ్రోన్ ధ్వంసమైంది. సుమారు రూ. 2 లక్షల నష్టం వాటిల్లడంతో డ్రోన్ నిర్వాహకునితో పాటు రైతు శంకర్‌గౌడ్‌లు కొంత భరించాల్సి వచ్చింది. ట్రాన్స్‌కో అధికారులు కరెంట్ తీగలను బిగిస్తే నష్టం వాటిల్లేదికాదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రంథాలయ ఆవిర్భావం స్ఫూర్తిదాయకం


అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంలో కమిటీ ప్రతినిధులు

బోధన్: సాలూర మండల కేంద్రంలో అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం(గ్రంథాలయం) ఏర్పాటు నేపథ్యం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. గ్రామానికి చెందిన స్వేరోస్ ఇంటర్నేషనల్ సభ్యులైన సింగాడి సునీల్, పాండు, సాలెన్ సంజీవ్, లింబూరి లక్ష్మణ్‌కు అంబేడ్కర్ పేరిట విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చింది. మూడేళ్ల క్రితమే కేంద్రం ఏర్పాటుకు బీజం పడింది. కేంద్ర నూతన భవన నిర్మాణానికి జీపీ పాలకవర్గం స్థలం కేటాయించింది. గ్రామ ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో సుమారు.3 లక్షల వరకు వెచ్చించి రేకుల షెడ్డును నిర్మించారు. గ్రంథాలయ ఏర్పాటుకు గ్రామస్తుల ఐక్యత, సహకారం తోడైంది. ముఖ్యంగా మాజీ ఎంపీపీ బుద్దె సావిత్రి భర్త సీనియర్ నాయకుడు దివంగత బుద్దె రాజేశ్వర్ కేంద్రం ఆవిర్భావంలో కీలక పాత్ర వహించారు.

10 మందితో కమిటీ ఏర్పాటు

విజ్ఞాన కేంద్రం నిర్వహణ, ఆర్థిక వనరుల సేకరణకు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులు సమావేశమై కసరత్తు చేశారు. 10 మందితో అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా ఎం స్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శిగా లింబూరి లక్ష్మణ్, మరో 8 మందిని ప్రతినిధులుగా ఎన్నుకున్నారు. దాతల సహకారంతో 1800 పుస్తకాలు కేంద్రానికి సమకూర్చారు. ఇటీవల బోధన్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు గుర్రాల సరోజనమ్మ పాఠకుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణానికి విరాళం అందించగా, నిర్మాణ పనులు పూర్తికావస్తుంది. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు విజ్ఞాన కేంద్రం సేవలు అందుబాటులో ఉంటాయి.

కట్టడాలు చరిత్రకు ఆధారాలు

- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ అర్వింద్

ఆర్మూర్: మన పూర్వీకులు కట్టిన కట్టడాలే చరిత్రకు ఆధారాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. బాల్కొండకు చెందిన బీఆర్ నర్సింగ్‌రావు రచించిన 'అల్లకొండ ఊరు ఉద్భవం - ఐదు ఆలయాలకు ప్రసిద్ధి' పుస్తకాన్ని ఆర్మూర్‌లోని ఎంపీ కార్యాలయంలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ.. పురాతన కట్టడాలకు మరమ్మతులు చేపట్టకుండా వదిలేస్తే శిథిలావస్థకు చేరుకొని వాటి ఉనికినే కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సింగ్‌రావు మాట్లాడుతూ బాల్కొండ 1059 సంవత్సరాల క్రితం అల్లయ్య, కొండయ్య రాజుల పాలనలో ఏర్పడిందన్నారు. ఆనాటి కట్టడాలకు మరమ్మతులు చేయాలని కోరారు. బాల్కొండ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. అల్లకొండ ఖిల్లా పరిరక్షణ సమితి గౌరవ అధ్యక్షులు భూసం సత్యనారాయణ, సంతోష్ కుమార్, పి నవీన్ కుమార్, డి పవన్ కుమార్, పురుషోత్తం, మారుతి, పాండు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూస్తా


గొట్టిముక్కలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మాక్లూర్: ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుత్ప, కల్లెడి, గొట్టిముక్కల, మాక్లూర్, అమ్రాద్ గ్రామాల్లో బుధవారం పర్యటించి ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. రేషన్ కార్డుల దరఖాస్తుల ప్రక్రియ సెప్టెంబర్ నుంచి ప్రారంభమవుతుందని అన్నారు. ఇల్లులేని పేదలకు ప్రభుత్వం రూ. 5 లక్షలు ఇస్తుందన్నారు. కార్యక్రమాల్లో ఎంపీవో టి శ్రీనివాస్, తహసీల్దార్ శేఖర్, ప్రత్యేక అధికారి జె ముత్తెన్న, నాయకులు గంగోనే సంతోష్, అనిల్‌కుమార్, గోవూరు ఒడ్డెన్న, సుబ్బారావు, బడుగు సత్యం, రమావత్ సురేష్ నాయక్, ముప్పా గంగారెడ్డి, చిన్నాపూర్ వినోద్, డి రమేశ్ పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఖలీల్‌వాడి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బుధవారం నిజామాబాద్ జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించి, నిరసన తెలిపారు. అంతకుముందు నిజామాబాద్ బార్ అసోసియేషనన్ అధ్యక్షుడు జగన్ మోహన్‌గౌడ్ అధ్యక్షతన న్యాయవాదులు సమావేశం నిర్వహించి, ఈవిషయమై ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బార్ ప్రతినిధులు రాజేంద ర్ రెడ్డి, వసంత్ రావు, సురేష్, పిల్లి శ్రీకాంత్, పడిగె ల వెంకటేశ్వర్, యెర్రం విఘ్నేష్, గంగాధర్, మాన ఖిక్ రాజ్, బిట్ల రవి, విశ్వక్‌సేన్ మధు, అరెటి నారాయణ, దేవదాస్, పుణ్యారాజ్, బాలాజీ, ఆశ నారాయణ, సుదర్శన్‌రావు, రవిప్రసాద్ పాల్గొన్నారు.

నియామకం



వేల్పూర్: మండలంలోని పోచంపల్లికి చెందిన హైకోర్టు అడ్వకేట్ దేశ్‌పాండే అనంత రావు జాతీయ మానవహక్కుల కౌన్సిల్ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్‌గా నియమితులయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జస్టిస్ చందూ కుమార్, ఎన్‌హెచ్‌ఆర్‌సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కొప్పుల విజయ్‌కుమార్, కార్యదర్శి మామిడాల మనోహర్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

బోధన్‌టౌన్/ వర్ని: బోధన్ పట్టణంలో, మోస్రా మండల కేంద్రంలో బీజేవైఎం, బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటా తిరిగి జాతీయ జెండాలను పంపిణీ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ జెండాలు అందజేత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పలు కాలనీల్లో ప్రధాని మోదీ పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగాలో భాగంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ జాతీయ జెండాలను ప్రజలకు అందజేశారు.

స్వాతంత్ర్య దినోత్సవ ర్యాలీ

పెర్కిట్: మామిడిపల్లిలో ఉన్న తెలంగాణ మైనార్టీ మహిళా గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు బుధవారం స్వాతంత్ర్య దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నహీద ఫిర్దోస్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – పాగల్ వీఎస్ కాదల్ (తెలుగు) - 02.05 భవనం 4.35, 10.20 సింబ (తెలుగు) - 7.35
- స్క్రీన్-2 – కమిటీ కుర్రోళ్లు - 12.30, 3.45, 07.00, 10.15
- స్క్రీన్-3 – మురారి (తెలుగు) - 11.05, 6.00, 10.00, తుఫాన్(తెలుగు)-3.05
- స్క్రీన్-4 – రాయన్ (తెలుగు) 11.40, 6.35, కల్కి 2898 ఏడీ (తెలుగు) - 2.50, 9.45

సంక్షిప్తం

పడగల్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన

వేల్పూర్: మండలంలోని పడగల్‌లో శుక్రవారం దేవి విగ్రహాన్ని బుధవారం వేదపండితుల మంత్రోచ్ఛరణలతో వైభవంగా ప్రతిష్ఠించారు. వీడీసీ ఆధ్వర్యంలో యజ్ఞం, పూర్ణాహుతి, ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో 'స్వచ్ఛదనం-పచ్చదనం'

రుద్రూర్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, పోలీస్‌స్టేషన్‌లో లయన్స్ క్లబ్ రుద్రూర్, దాత్రి శ్రీ ఫౌండేషన్, ఆహారశాస్త్ర, సాంకేతిక విజ్ఞాన కళాశాల ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై అప్పారావు, హెచ్ఎం శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ సభ్యులు కేవీ మోహన్, శ్యాంసుందర్ పహాడే, ప్రశాంత్ గౌడ్, దాత్రిశ్రీ సభ్యులు గాండ్ల మధు, సాయికిరణ్, గంగాధర్, ఫుడ్ సైన్స్ కళాశాల ప్రొఫెసర్ సాయి ప్రసాద్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు స్పీకర్ సెట్ వితరణ

రెంజల్: మండలంలోని నీలా ప్రభుత్వ హైస్కూల్‌కు బుధవారం లయన్స్‌క్లబ్ ఆచన్‌పల్లి, పాఠశాల ఉపాధ్యాయుడు చిదుర ప్రవీణ్‌కుమార్ సంయుక్తంగా స్పీకర్ సెట్‌ను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇల్తెపు శంకర్, లయన్స్ ప్రతినిధులు రామకృష్ణ, గణపతిరెడ్డి, హరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపడుతాం

బోధన్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నర్సింగ్ విద్యార్థులు ఉంటున్న గదుల పైకప్పును అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులతో కలిసి పరిశీలించినట్లు డీసీసీ డెలికెట్ గంగాశంకర్ తెలిపారు. తహసీల్దార్ విఠల్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు ఉన్నారు.

ఘనంగా తీజ్

మోర్తాడ్: ఏర్గట్ల మండలం బట్టాపూర్ తండాలో గిరిజనులు తీజ్ పండుగను బుధవారం నిర్వహించారు. పిండివంటలు చేసి తమ ఇష్టదైవానికి నైవేద్యం సమర్పించారు. గిరిజన యువతులు పాటలు పాడుతూ నృత్యాలు చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

మాక్లూర్: మండలంలోని మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో బుధవారం మండల వైద్యాధికారి ప్రకాశ్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి వెంకటేశ్వర్‌రావు, ఆ యూష్ మెడికల్ అధికారి వరలక్ష్మి, పీహెచ్‌సీ సీఈవో వెంకటేశ్, ప్రమీల, సుమతి, రేణుక, రమణారాణి, పద్మ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, సుమలత పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

రుద్రూర్: పొతంగల్ విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను విండో చైర్మన్ శాంతేశ్వర్ పటేల్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, మండల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా సేవలను వినియోగించుకోవాలి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్‌లో తపాలా శాఖ కల్పిస్తున్న పాలసీలపై పోస్ట్‌మాస్టర్ కిషన్‌నాయక్ బుధవారం అవగాహన కల్పించారు. తపాల శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.